

మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్



● మెళియాపుట్టి మండలం జాడుపల్లి జిల్లాపరిషత్ పాఠశాల ఇది. ఈ పాఠశాలలో 142మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడేళ్ల కిందట నాడు-నేడు పథకం కింద ఈ పాఠశాలకు భవనాలతోపాటు ప్రహరీ నిర్మాణానికి రూ.26లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపేశారు. ఇటీవల కురిసిన వర్షానికి పాఠశాల చెరువులా మారింది. తరగతి గదుల్లోకి నీరు చేరడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. కొండల నుంచి వచ్చిన నీరు పాఠశాలలోకి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షపునీరు.. నిలబడి



టెక్కలి మండలం నర్సింగపల్లి మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఇది. ఈ పాఠశాలలో 42మంది విద్యార్థులు చదువుతున్నారు. వర్షం కురిస్తే చాలు పాఠశాల ఆవరణలో నీరు నిలిచి.. తరగతి గదుల్లోకి వెళ్లలేని పరిస్థితి. గతంలో నాడు-నేడు పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయి. కానీ పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టలేదు. పాఠశాల ఆవరణలో కంకర వేసి ఎత్తు చేయకపోవడంతో నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

● ప్రభుత్వ పాఠశాలలకు వరద ముంపు సమస్య
● 'నాడు-నేడు' పేరిట నిధులు వృథా
● అసంపూర్తిగా అభివృద్ధి పనులు
● విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

మెళియాపుట్టి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు వెంటాడుతున్నాయి. వర్షం కురిస్తే చాలు.. పాఠశాలల ఆవరణలో నీరు నిలిచిపోవడం.. కొన్నిచోట్ల తరగతి గదుల్లో వరదనీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేశామని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధమనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 1,954 ప్రాథమిక, 268 ప్రాథమికోన్నత, 416 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' పథకం కిందట తొలివిడత 958 పాఠశాలల అభివృద్ధికి రూ.246.72కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపింది. రెండో విడతలో 1,058 పాఠశాలలకు రూ. 445.34కోట్లు (మిగతా 6వ పేజీలో..)

'జల్‌జీవన్'కు ప్రాధాన్యం

● గతంలో వైసీపీ నిర్లక్ష్యంతో పూర్తికాని పనులు
● కోస్టల్ కారిడార్ కోసం సిద్ధమవుతున్న డీపీఆర్
● మరో ఆరులేన్ల రహదారి వస్తోంది
● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 'జల్‌జీవన్ మిషన్' పనులను గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం చేసిందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, నేషనల్ హైవే, ఎంపీ లాడ్స్‌కు సంబంధించి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'జలజీవన్ మిషన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. జలజీవన్ మిషన్ శక్తి సామర్థ్యాలు తెలియక గతంలో వైసీపీ సర్కారు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసింది. రాష్ట్రంలో జలజీవన్ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండగా.. జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గతంలో పూర్తికాని, ప్రారంభానికి నోచుకోని కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు పునఃప్రారంభిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి జల్‌జీవన్ పనులు పూర్తిచేస్తాం. ఉద్దానం ప్రాజెక్టును కూడా బలపరుస్తున్నాం. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు స్ఫూర్తితో ఎంపీ ల్యాడ్స్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఎంపీ ల్యాడ్స్‌ను వినియోగిస్తూ.. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బస్ కాంప్లెక్స్, ఎలక్ట్రికల్ లైన్లు, సోలార్ లైన్లు, ఇతర ప్రాజెక్టులను నిర్మించామ'ని తెలిపారు.

● మరో ఆరులేన్ల జాతీయ రహదారి

'ఆరులేన్ల జాతీయ రహదారి సాధన కోసం ఇప్పటికే పలు దఫాలు కేంద్ర మంత్రిత్వ (మిగతా 6వ పేజీలో..)

కాశీబుగ్గ డీఎస్పీ బదిలీ

పలాస, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావును రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని కోరడంతో వెంటనే ఆయన రిలీవ్ అయ్యారు. గతేడాది నవంబరు 10న ఆయన కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ఎవరినీ నియమించ లేదు. ఆయన్ను ఎందుకు బదిలీ చేశారో కారణాలు తెలియరాలేదు.

భర్త దూరమవుతున్నాడని..

● మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం
● పోలీసుస్టేషన్ ఆవరణలో పురుగుల మందు తాగి..
● ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రూపవతి

పలాస, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విభేదాల కారణంగా భర్త తనకు దూరమవుతాన్నడనే మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మార్కెట్‌లో పురుగుల మందు తాగారు. న్యాయం కోసం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు వెళ్లి.. అక్కడ ఆవరణలో కుప్పకూలిపోయారు. పోలీసులు, కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా.. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

● పలాస మండలం గొల్లమాకనపల్లికి చెందిన రాపాక రూపవతికి మందస మండలం లింబుగాం గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు భానుతేజతో రెండున్నరేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న ఓ బాబు ఉన్నాడు. కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడి తరచూ ఘర్షణ పడుతున్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో నెలరోజుల కిందట రూపవతి తన భర్తపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ దంపతులిద్దరికీ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి.. కాపురంగా సక్రమంగా చేసుకోవాలని సర్దిచెప్పారు. కాగా.. గురువారం మధ్యాహ్నం రూపవతి మళ్లీ కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించారు. భర్తతో పాటు అత్త, మామ తనను వేధిస్తున్నారని, దాడి కూడా చేశారని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీంతో సీఐ పి.సూర్యనారాయణ.. భానుతేజతో ఫోన్‌లో మాట్లాడారు. భార్యను వేధించడమేంటని ప్రశ్నించారు. సమస్య పరిష్కరించుకోకుంటే కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో భానుతేజ నుంచి వ్యతిరేక సమాధానం రావడంతో రూపవతికి ఈ విషయాన్ని సీఐ వెల్లడించారు. చట్టపరంగా కేసు నమోదు చేసి ఫ్యామిలీ కోర్టులో హాజరుపరుస్తామని, మీకు (మిగతా 6వ పేజీలో..)



ఆర్ట్స్ కళాశాల నుంచి వెనుదిరిగి పోతున్న డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు

ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ వాయిదా

గుజరాతీపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా పడిందని జిల్లా విద్యాశాఖాధికారి రవి తెలిపారు. ఈ నెల 19న అమరావతిలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అభ్యర్థులను అమరావతి తీసుకెళ్లేందుకు శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం బస్సులను సిద్ధం చేశారు. అమరావతి వెళ్లేందుకు అభ్యర్థులంతా ఆర్ట్స్ కళాశాలలో బస్సుల వద్దకు చేరుకున్నారు. కాగా.. అమరావతిలో భారీ వర్షాల కారణంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు గురువారం మధ్యాహ్నం అధికారులకు సమాచారం అందింది. దీంతో అభ్యర్థులంతా వెనుదిరిగారు. నియామక తేదీలను త్వరలో ప్రకటిస్తామని డీఈవో రవి తెలిపారు.

● వృథాగా పీఏసీఎస్ గోదాములు
● వైసీపీ సర్కారు నిర్వాకం.. రైతులకు శాపం
● ప్రక్షాళన చేస్తున్న కూటమి ప్రభుత్వం



మెళియాపుట్టిలో ఊరికి దూరంగా ఉన్న పీఏసీఎస్ గోదాము

ఊరికి దూరం సేవలు నిరుపయోగం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. రైతులు పండించిన పంటలు, వ్యవసాయ ఉత్పత్తులను దాచుకునేందుకు వీలుగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పీఏసీఎస్) సంబంధించి గోదాములు నిర్మించారు. కానీ అవి గ్రామాలు, పట్టణాలకు దూరంగా రక్షణ లేని ప్రాంతాల్లో నిర్మించడంతో నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. జిల్లాలో 37 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. వైసీపీ హయాంలో 25 గోదాములు నిర్మించాలని భావించారు. 18 గోదాముల నిర్మాణాన్ని పూర్తిచేశారు. 5 వివిధ దశల్లో ఉన్నాయి. మరో రెండు స్థల సమస్య కారణంగా నిర్మాణానికి నోచుకోలేదు. 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ గోదాము ఒక్కోదానికి రూ.40లక్షలు ఖర్చు చేశారు. అంటే 25 గోదాములకు రూ.10 కోట్లు అన్నమాట. కానీ ఈ గోదాములేవీ వినియోగంలోకి తేకపోవడంతో లక్ష్యం దెబ్బతింది. నిర్మాణ బాధ్యతలు మార్కెటింగ్ శాఖ చూసింది. కానీ సహకార శాఖ మాత్రం వినియోగించలేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● పూర్తిగా నిర్వీర్యం

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. రైతుభరోసా కేంద్రాల పేరిట పీఏసీఎస్‌లను నిర్వీర్యం చేశారు. వైసీపీ పాలనలో చాలా ప్రాథమిక సహకార సంఘాల్లో అక్రమాలు బయటపడ్డాయి. కేవలం కంప్యూటరీకరణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ.. పీఏసీఎస్‌ల బలోపేతానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా పూర్తిగా కంప్యూటరీకరణ చేస్తోంది. అధికారులు ఆన్‌లైన్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రతి రైతుకు ఈకేవైసీ చేసి వివరాలను పూర్తి స్థాయిలో కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయాలకు (మిగతా 6వ పేజీలో..)

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 37 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,01,671 మంది సభ్యులు ఉన్నారు. గతంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతు సేవలో తరించేవి. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారిపోయింది. తొలుత ఎటువంటి రుసుం చెల్లించకుండానే.. రైతులు ఈ సంఘాల ద్వారా పంట రుణాలు, ఎరువులు పొందేవారు. పంట ఉత్పత్తులు విక్రయించిన తరువాత రుణాలు చెల్లించేవారు. కొద్దిరోజుల తరువాత సభ్యత్వ రుసుం కింద రూ.10 వసూలు చేసేవారు. సంఘ సభ్యులుగా చేర్చుకునేవారు. ప్రాంతీయ వ్యవసాయ కోఆపరేటివ్ బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందేవారు. ప్రస్తుతం పీఏసీఎస్‌ల్లో రైతుల సభ్యత్వం తగ్గిపోయింది. సభ్యత్వ రుసుం ఏకంగా రూ.300కు పెరిగింది. ప్రస్తుతం పీఏసీఎస్‌లకు కూటమి ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. త్రిమెన్ కమిటీల నియామకం పూర్తిచేసింది. అందుకే గతం మాదిరిగా సేవలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. అన్నింటికీ మించి రైతుల కోసం నిర్మించిన గోదాములను వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధిలో మహిళలే టాప్

● పథకం అమలుతో తగ్గిన వలసలు
● ఏటా పెరుగుతున్న వేతనదారుల సంఖ్య
● పనుల్లో రాష్ట్రంలోనే సిక్కోలుకు ప్రథమస్థానం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):

వలసల నివారణ, గ్రామాల్లో పేదలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రవేశపెట్టిన జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. పురుషుల కన్నా మహిళలు అధిక సంఖ్యలో పనులకు హాజరై ఉపాధి పొందుతున్నారు. ఉపాధిహామీ పథకంలో లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు మార్పులకు శ్రీకారం చుట్టాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం కల్పిస్తూ వివిధ రకాల పనులను ఉపాధిహామీకి అనుసంధానం చేశాయి. మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించాయి. లబ్ధిదారులకు ఎక్కువ పనిదినాలను కల్పిస్తున్నాయి. సాగునీటి వనరుల అభివృద్ధి, పండ్ల తోటల పెంపకం, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం, తదితర పనుల కల్పనతో వేతనదారుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలోనే అత్యధిక పనిదినాలు కల్పించి, చెల్లింపులు చేసిన (మిగతా 6వ పేజీలో..)

నాలుగేళ్లలో ఉపాధిహామీ పనులిలా..

సంవత్సరం	పురుషులు	మహిళలు	పని దినాలు	వేతనాలు
2022-23	1,85,514	3,12,387	1,44,55,281	రూ.273కోట్లు
2023-24	1,87,531	3,18,309	1,56,78,618	రూ.393కోట్లు
2024-25	1,80,660	3,14,588	1,45,12,915	రూ.359కోట్లు
2025-26 (ఆగస్టు 30 వరకు)	1,02,376	2,90,683	97,19,617	రూ.236కోట్లు



ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు

ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో మన జిల్లా ఎమ్మెల్యేలు తమ గళం వినిపించారు. తమ నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. వాటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని... సంబంధిత మంత్రులను కోరారు.

అసెంబ్లీలో మనవాణి

- సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యేలు
- పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

శివారు గ్రామాలకు సాగునీరందించాలి

- ఎమ్మెల్యే గొండు శంకర్



అరసవల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గార మండలంలో గల శివారు గ్రామాలకు సాగునీరు అందించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అసెంబ్లీలో కోరారు. నియోజకవర్గంలో గల సాగునీటి సమస్యలను గురువారం ఆయన ప్రస్తావించారు. వంశధార కుడి కాలువ పరిధిలోని 37టీ ప్రాజెక్టు పనులు 2009లో నిలిచిపోవడంతో 2600 ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాత కాంట్రాక్టును రద్దు చేసి రూ.10 కోట్లతో కొత్త పనులు వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై మంత్రి నిమ్మలరామానాయుడు స్పందిస్తూ గార మండలంలోని అంబళ్లవలస, కొత్తవలస ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వంశధార కుడి కాలువ పరిధిలోని 22 గ్రామాలకు త్వరలోనే పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

వంశధార బ్యారేజ్ ప్రమాదంలో ఉంది

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాకు గుండెకాయ లాంటి వంశధార బ్యారేజ్ నిర్వహణ సక్రమంగా లేక ప్రమాదంలో ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బ్యారేజ్‌ను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని గురువారం అసంబ్లీ సమావేశాల్లో కోరారు. శ్రీకాకుళం జిల్లాకు జీవనాడి అయిన వంశధార ఎడమ కాలువను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ స్ట్రక్చరర్స్ కల్వర్టులు పడిపోయాయని సభలో తెలిపారు. గతంలో జరిగిన షట్టర్ల కుంభకోణం పాపానికి శివారు భూములకు నీరు వెళ్లక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తవించారు. వంశధార బ్యారేజ్ కుప్పకూలే పరిస్థితి ఉందని ..యాప్రాన్ పోయిందని.. బ్యారేజ్ నిర్వహణ సరిగా లేదన్నారు. వంశధార బ్యారేజ్ దెబ్బతింటే శ్రీకాకుళం జిల్లా ఏడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వంశధార బ్యారేజ్‌ను పునర్నిర్మించడంతో పాటు ఎడమ కాలువను ఆధునికీకరణ పనులు చేపట్టాలని కోరారు.

లబ్ధిదారుల జాబితాలు ఎందుకు ఆపారు?

- ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాలకు సంబంధించి ఆరు నెలల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేశారని.. వారికి రుణాలు ఇవ్వకుండా ఎందుకు ఆపాల్సి వచ్చిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో గురువారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆరు నెలల క్రితం లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. లబ్ధిదారుల నుంచి రుణాలు వస్తాయా, రాదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనిపై ఎమ్మెల్యేలందరికీ స్పష్టం చేయాలని ఆమె కోరారు.

శివారుకూ నీరందేలా చూడండి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గొట్టా బ్యారేజ్ కింద సుమారు 2లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. దీని ద్వారా శివారు భూమికి సాగు నీరందేలా చూడాలని అసెంబ్లీలో గురువారం కోరారు. గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగా లైనింగ్ పనులు చేపట్టలేదని చెప్పారు. కుడి, ఎడమ కాలువల్లో పూడికతీతలు చేపట్టాలని కోరారు. బెడ్‌వాల్స్, యాప్రాన్ నిర్మాణాలు చేపట్టాలని విన్నవించారు. దీని కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.





సన్యాసిరావు మృతదేహం వద్ద గౌరవ వందనం చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

అవయవ దానంతో మూడు జీవితాలకు వెలుగు

- బాతువ వ్యక్తి బ్రెయిన్‌డెడ్
- మానవత్వాన్ని చాటుకున్న కుటుంబ సభ్యులు

జి.సిగడాం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్నప్పటికీ ఆ కుటుంబం ఉదారతను చాటుకుంది. మరో మూడు జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు వచ్చింది. వివరాల్లోకి వెళితే... బాతువ గ్రామానికి చెందిన పోతిరెడ్డి సన్యాసిరావు నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆసుపత్రిలో చేరాడు. రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రెండు రోజుల పాటు చికిత్స పొందిన సన్యాసిరావుకి మరోమారు స్ట్రోక్ రావటంతో పరిస్థితి విషమించింది. దీంతో రాగోలులోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మూడు రోజుల పాటు చికిత్స పొందినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అక్కడి వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అవయవ దానం చేయడం వల్ల మరో మూడు కుటుంబాలలో వెలుగులు నింపేందుకు అవకాశం ఉంటుందని అక్కడి వైద్యులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వైద్యులు చెప్పిన విషయాన్ని పెద్ద మనస్సుతో అర్థం చేసుకున్న కుటుంబ సభ్యులు సన్యాసిరావు భార్య పైడమ్మ, కుమారుడు లక్ష్మీనాయుడు, కుమార్తె సంతోషి, అల్లుడు అప్పలనాయుడు అవయవ దానానికి ముందుకు వచ్చారు. వారిని వైద్యులు అభినందించారు. సన్యాసిరావు నుంచి సేకరించిన అవయవాల్లో లివర్, ఒక కిడ్నీని రాగోలు జెమ్స్ ఆసుపత్రికి, మరో కిడ్నీని విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తికి కేటాయించారు. ఆసుపత్రి సిబ్బంది...సన్యాసిరావు మృతదేహానికి గౌరవ వందనం సమర్పించారు. అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సన్యాసిరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కుమారుడు లక్ష్మీనాయుడుకి ఉద్యోగ అవకాశం కల్పించాలని గ్రామస్థులు కోరారు.

ఊరికి దూరం.. సేవలు నిరుపయోగం

(ఐదో పేజీ తరువాయి)

ఆయా సొసైటీల వివరాలు, లావాదేవీలకు సంబంధించి దస్త్రాలు వెళ్లాయి. సహకార సంస్థ, గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఈకేవైసీ పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు.

నివేదిక అందజేశాం..

జిల్లావ్యాప్తంగా 37 పీఏసీఎస్‌లు ఉన్నాయి. గతంలో 25 గోదాముల నిర్మాణం చేపట్టాలని భావించాం. కానీ వివిధ కారణాలతో 18 గోదాముల నిర్మాణం పూర్తయింది. కొన్ని గోదాములు వినియోగంలోకి రాకపోవడం నిజమే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ప్రస్తుతం జిల్లాలోని పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ కొలిక్కి వచ్చింది.

-మురళీకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి, శ్రీకాకుళం

'జల్‌జీవన్'కు ప్రాధాన్యం

(ఐదో పేజీ తరువాయి)

శాఖకు పరిస్థితులను వివరించాం. నరసన్నపేట నుంచి పాతపట్నం వరకు జాతీయ రహదారి అభివృద్ధి చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తగ్గింది. జిల్లాలో కోస్టల్ కారిడార్ ద్వారా తీరానికి ఆనుకుని మరో ఆరు లేన్ల జాతీయ రహదారి వస్తోంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పష్టమైన కార్యాచరణతో ఉన్నారు. లాజిస్టిక్ కనెక్టివిటీ వల్ల ఎకనామిక్ గ్రోత్ ఉంటుంది. కోస్టల్ కారిడార్‌కు సంబంధించి ఇప్పటికే డీపీఆర్ కోసం విశాఖపట్నంలో కార్యాలయం కూడా ప్రారంభించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తాం. దీనికి అనుసంధానమయ్యే నేషనల్ హైవే అంశాల గురించి సమీక్ష నిర్వహించాం. శ్రీకాకుళం జిల్లా పరిధిలో 180 కిలో మీటర్లకు పైగా ఉన్న జాతీయ రహదారిలో ప్రమాదాలు సంభవించే ప లు బ్లాక్‌స్పాట్స్ లను గుర్తించాం. ప్రమాదాల నివారణకు లైటింగ్ ఏర్పా టుచేసి.. రోడ్డును కూడా బ్యూటిఫికేషన్ చేయాలి. మూలపేట పోర్టు విని యోగంలోకి వస్తే హైవేపై మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశముంది. అందుకు తగ్గట్లుగా జాతీయ రహదారి విస్తరణ కూడా త్వరలో జరుగుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో మహిళలే టాప్

(ఐదో పేజీ తరువాయి)

జిల్లాగా శ్రీకాకుళం ప్రథమ స్థానంలో నిలిచింది. అధికారులు ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వరకూ 2.90లక్షల మంది మహిళలకు పనిదినాలు కల్పించారు. మహిళలు ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా పనులు కేటాయిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడినట్లు జాతీయ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో చాలా కుటుంబాలు ఉపాధి కోసం వలస పోయాయి. కానీ ప్రస్తుతం ఉపాధిహామీ పథకం ద్వారా స్థానికంగా పనులు లభ్యం కావడంతో వలసలు తగ్గుముఖం పట్టాయని అధికారులు చెబుతున్నారు.

- **ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా..**



ఉపాధిహామీ పనుల్లో మహిళలను అత్యధికంగా భాగస్వాములను చేయడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మహిళా ఆర్థిక స్వావలంబనే కుటుంబ ఆర్థిక స్వా తంత్ర్యానికి పునాది రాయి. రానున్న రోజుల్లో కూడా లక్ష్యాలను చేరుకుంటాం. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను మరింతగా ప్రోత్సహించి, ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

-సుధాకరరావు, డ్వామా పీడీ

సంస్కృతం సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పీఎం ఉషా నిధుల సహకారంతో తెలుగు విభాగం ఆధ్వర్యంలో సంస్కృతం సర్టిఫికెట్ కోర్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి సంబంధించి సంస్కృతం అతి ప్రాచీనమైదని, దీని నుంచి హిందీ వంటి భాషలు ఉద్భవించాయని తెలిపారు. కార్యక్రమలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, తెలుగు విభాగం సమన్వయకర్త పి.లక్ష్మణరావు, డీన్ ఎన్.లోకేశ్వరి, అధ్యాపకులు కె.ఉదయకిరణ్, ఎం.బలరాంనాయుడు, డి.ప్రకాశరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ రజని

భర్త దూరమవుతున్నాడని..

(ఐదో పేజీ తరువాయి)

న్యాయం జరుగుతుందని రూపవతికి తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో రూపవతి తన కుమారుడ్ని పోలీస్ స్టేషన్‌లో ఉంచి.. బిస్కెట్లు కొనుగోలు చేసి వస్తాని చెప్పి బయటకు వెళ్లారు. భర్త తనకు దూరమవుతున్నాడని మనస్తాపంతో మార్కెట్‌కు వెళ్లి పురుగుల మందు కొనుగోలు చేసి అక్కడే తాగారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి బయటే కుప్పకూలిపోయారు. పోలీసులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మెరు గైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కాశీబుగ్గలో ఓ ప్రైవే టు ఆసుపత్రికి ఆమెను తరలించి వైద్యం అందించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో శ్రీకాకుళం తరలించాలని వైద్యాధికారి చెప్పారు. గురువారం రాత్రి ఆమెను శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా.. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సూర్యనారాయణ తెలిపారు.

వర్షపునీరు.. నిల'బడి'

(ఐదో పేజీ తరువాయి)

వెచ్చించినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా.. అధికంగా నిధులు ఖర్చు చేసినా పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తికాక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు.. పలు పాఠశాలల ఆవరణ, తరగతి గదుల్లో నీరు నిలిచిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. కొంత మంది వరదనీటిలోనే చదువులు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో బిల్లులు సక్రమంగా చెల్లించక.. చాలా చోట్ల పనులు మధ్య లో వదిలేశారు. అప్పట్లో కొంతమంది వైసీపీ నేతలు కాంట్రా క్టర్లుగా వ్యవహరించడంతో పనుల్లో నాణ్యత పాటించ లేదనే ఆరోపణలు ఉన్నాయి. నాడు-నేడు పనుల్లో అవకతవకలు జరిగా యనే విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటిపై విచారణ చేపడుతోంది. అక్రమాల లెక్క తేలేవరకూ పాఠశాలల్లో పనులు చేపట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలకు వరద ముంపు సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

ఆదేశాలు లేవు..

గత ప్రభుత్వ హయాంలో మధ్యలో వదిలేసిన 'నాడు-నేడు' పనులు చేపట్టాలని ఆదేశాలు లేవు. రెండో విడతలో అధికంగా పనులు చేసినవారికి బిల్లులు చెల్లించాల్సి ఉంది. కొన్ని పాఠశాలల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. తాత్కాలిక పనులు చేపడతాం.

-పద్మనాభం, ఎంఈవో 2, మెళియాపుట్టి

ఎయిడ్స్ నియంత్రణలో ముందంజ

- రాష్ట్ర సంచాలకులు నీలకంఠరెడ్డి


శ్రీకాకుళం రిమ్స్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధి పూర్తిగా నియంత్రణలో ఉందని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్‌ప్రాజెక్టు సంచాలకులు కె.నీలకంఠరెడ్డి తెలిపారు. 2010లో 4.1శాతం ఉన్న వ్యాధి ప్రస్తుతానికి 0.5 శాతానికి తగ్గిందన్నారు. గురువారం ఆయన శ్రీకాకుళంలో గల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ని ఏఆర్‌టీ కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నివారణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో అనేక ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో 2.75 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నారని... వారందరికీ ఉచితంగా మందులు, పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో మరో 42 వేల కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సర్వేలో మరో 50 వేల మంది రోగులను గుర్తించే అవకాశం ఉందన్నారు. వారికి కూడా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా సేవలందించేందుకు సంపూర్ణ సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓ డా.మేరీ క్యాథరిన్, ఎయిడ్స్ నియంత్రణాధికారి డా.తాడేల శ్రీకాంత్, రిమ్స్ డైరెక్టర్ రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న నీలకంఠరెడ్డి

లెక్కలతో మొదలుపెట్టి.. భాషకు పదునుపెట్టి

- ఇదీ తాతాజీ ప్రత్యేకత
- నేడు తాపీ ధర్మారావు జయంతి



తాపీ ధర్మారావు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాపీ ధర్మారావు... ఈ పేరును తెలుగు సాహితీవేత్తలకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉండదు. 'దేవాలయాలపై బూతు బొమ్మలు ఎందుకు?' అని ప్రశ్నించి.. 'ఆలిండియా అడుక్కు తినేవాళ్ల మహాసభ'తో గుర్తింపు పొంది... 'పెళ్లి దాని పుట్టు పుర్వోత్తరాలు'ను మనకు వివరించిన సాహితీవేత్త తాపీ ధర్మారావు. పాతపాళీ, కొత్తపాళీ, ఆంధ్రతేజం వంటి రచనలు ఆయన కలం నుంచి జాలువారాయి. హేతువాదిగా... నాస్తికునిగా... సాహితీవేత్తగా... చరిత్ర పరిశోధకునిగా... పత్రికా సంపాదకునిగా... సినీ గేయ రచయితగా ఆయన సుపరిచితులు. తాపీ ధర్మారావు తొలినాళ్లలో ఉపాధ్యాయునిగా పనిచేశారు.

లెక్కలు మాస్టారుగా మొదలై..

పూర్వపు గంజాం జిల్లాలోని బరంపురంలో 1887 సెప్టెంబరు 19న జన్మించిన తాపీ ధర్మారావు అసలు పేరు బండారు ధర్మారావు నాయుడు. ఆయన వంశంలోని లక్ష్మన్న అనే వ్యక్తి సైనికోద్యోగం నుంచి తిరిగివచ్చి తాపీ పనిలో స్థిరపడ్డాడు. ఆ తర్వాత కాలంలో తాపీ ఇంటిపేరుగా మారింది. ధర్మారావు విజయనగరం రిప్పన్ స్కూల్‌లో ప్రాథమిక విద్య చదివారు. బాల్యంలో గణితంపై ఆయన బాగా పట్టు సాధించారు. విజయవాడలో మెట్రిక్యులేషన్, పర్లాకిమిడిలో ఎఫ్ఏ వరకు చదివారు. పర్లాకిమిడిలో చదివే రోజుల్లో వ్యవహారిక భాషావేత్త గిడుగు రామ్మూర్తి పంతులు ఆయనకు గురువు. ఆ తర్వాత చెన్నైలోని పచ్చయ్యప్ప కళాశాలలో ఈయన బీఏ చదివారు. కళ్లికోట రాజావారి కళాశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేశారు. తొలుత టెక్కలిలో లెక్కలు మాస్టారుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. రూ.15 జీతానికి ఉద్యోగం చేస్తూ టెక్కలిలోనే కాపురం పెట్టారు. రూ.25 నెల జీతం కోసం బరంపురంలోని కళ్లికోట రాజా కళాశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. తర్వాత పాత్రికేయ రంగంలో ప్రవేశించి తుది శ్వాస విడిచే వరకు అదే వృత్తిలో కొనసాగారు. ఆయన జయంతిని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా కూడా నిర్వహిస్తున్నారు.

గిడుగు వారి శిష్యునిగా..

పర్లాకిమిడిలో ఎఫ్ఏ చదివే రోజుల్లో తాపీ ధర్మారావుకు గిడుగు రామ్మూర్తి పంతులు చరిత్ర పాఠాలు బోధించేవారు. ధర్మారావు తెలివితేటలను తొలిసారిగా గుర్తించి ప్రపంచం దృష్టికి తెలియజేసింది గిడుగు వారే. వాడుక భాషకు కొత్త మెరుగులు దిద్దారు ధర్మారావు. మన సినిమాల్లోనూ. పత్రికల్లోనూ ప్రామాణిక ప్రయోగాలుగా చలామణీ అవుతున్న వాటిలో ఎక్కువ భాగం ధర్మారావు చలువేనని చెబుతారు.

గౌరవ పురస్కారాలు..

శృంగేరి పీఠాధిపతులు జగద్గురు చంద్రశేఖర భారతీ శంకరాచార్యుల వారి నుంచి 1926లో 'ఆంధ్ర విశారద' బిరుదును ధర్మారావు అందుకున్నారు. చేమకూర వెంకట కవి రాసిన విజయవిలాసం కావ్యానికి చేసిన హృదయోల్లాస వ్యాఖ్యకు 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు తాతాజీ.

సినిమా రచయితగా..

1911లో ఆయన తొలి రచన 'ఆంధ్రులకొక మనవి' పేరిట వెలువడింది. కొండెగాడు, సమదర్శిని, జనవాణి, కాగడా తదితర పత్రికలు అతని ప్రతిభకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. మాలపిల్ల, రైతుబిడ్డ, కీలుగుర్రం, పల్లెటూరి పిల్ల, రోజులు మారాయి, తదితర సినిమాలకు ఆయన సంభాషణలు రాశారు. తాపీ ధర్మారావును గౌరవంగా తాతాజీ అని పిలిచేవారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బొబ్బిలి రాజా ఉన్నప్పుడు తాపీ ధర్మారావు ఆయన వద్ద కార్యదర్శిగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్ర పత్రికా రచయితల మహాసభకు తొలి అధ్యక్షులు ఆయనే. తాపీ ధర్మారావు 1973 మే 8న తనువు చాలించారు. తెలుగు సినీ దర్శకుడు తాపీ చాణక్య ఆయన కుమారుడే.

ఆదాయాన్ని పట్టుకుందాం

- మల్బరీ సాగుతో లాభాలు
- ప్రభుత్వం నుంచి రాయితీలు



మల్బరీ మొక్కలు

పాత శ్రీకాకుళం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమ.. యువతకు.. రైతులకు ఉపాధిని స్తానని భరోసా ఇస్తోంది. దీనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. దీనికి కీలకమైన మల్బరీని సాగు చేయాలి. వీటిని ఒకసారి నాటితే 15 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుంది. మల్బరీ సాగుకు ఒకటిన్నర నుంచి రెండున్నర ఎకరాల మెట్ట భూమి.. నీటి వసతి కలిగిన రైతులను ఎంపిక చేస్తారు. ఎకరాకు 5వేల మొక్కలకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఎస్సీ, ఎస్టీలకు కేంద్రం 65 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వంతున, ఇతర సామాజిక వర్గాల వారికి కేంద్రం నుంచి 50 శాతం, రాష్ట్రం 25 ఐదు శాతం రాయితీ ఇస్తాయి.

మూడు నెలల తరువాత..

మల్బరీ మొక్కలు పెరగడానికి మూడు నెలల సమయం పడుతుంది. అప్పటి నుంచి నెలకోసారి పంట కోతకు వస్తుంది. రెండున్నర ఎకరాలలో వేర్వేరుగా పంట వేసుకుంటే ఒక దాని తరువాత ఒకటి కోతకు వీలుగా ఉంటుంది. ఈ విధంగా చేయడం ద్వారా ఏడాదిలో పదిసార్లు దిగుబడి సాధించవచ్చునని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.



ఆకులను వేరు చేస్తూ...

షెడ్ల నిర్మాణానికి..

పట్టు సేకరణ కోసం నిర్మించే షెడ్లకు కూడా ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీని నిర్మాణానికి రూ.4,50,000 వ్యయం అవుతుందని అంచనా. దీనిలో ఎస్సీ, ఎస్టీలకు 90శాతం రాయితీ అంటే రూ.4,05,000 వస్తుంది. లబ్ధిదారులు 10 శాతం అంటే రూ.45,000 భరించాలి. మిగిలిన సామాజిక వర్గాల వారికి 75శాతం రాయితీ అంటే రూ.3,33,500 వర్తిస్తుంది. లబ్ధిదారు వాటా 25 శాతం రూ.1,12,500 భరించాలని అధికారులు తెలిపారు.

జిల్లాలో ఇలా..

శ్రీకాకుళం జిల్లాలో 129 ఎకరాల్లో 50 మంది రైతులు పట్టు తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పట్టు పరిశ్రమ నుంచి ఒకసారి కనీసం రూ.50వేల వరకు ఆదాయం వస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఏడాదికి కనీసం ఎనిమిదిసార్లు దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ రాయితీలను ఉపయోగించుకొని.. పట్టు పరిశ్రమపై యువత, రైతులు దృష్టి పెడితే లాభాలు ఆర్జించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ఆదాయం బాగుంది..



నేను ఆర్మీలో ఉద్యోగం చేశాను. పదవీ విరమణ తరువాత 2017లో రూ.12 లక్షల వ్యయంతో పట్టు పరిశ్రమను ప్రారంభించాను. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.3 లక్షలు, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నుంచి రూ.4 లక్షలు రాయితీ లభించింది. పట్టు తీయడానికి నెల రోజులు సమయం పడుతుంది. ఒకసారి కనీస ఆదాయం రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది.

-కె.అప్పలనాయుడు, మలకాం, పొందూరు మండలం

తక్కువ పెట్టుబడితో..



పట్టు పరిశ్రమ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సమకూర్చుతుంది. పట్టు పురుగుల పెంపకానికి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుంది. వాటిని వినియోగించుకుని జిల్లా యువత ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలి. మన జిల్లాలో సెరీకల్చర్‌కు అనువైన వాతావరణం ఉంది.

-పి.చంద్రజీవన్, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి

పర్యవేక్షణ లేక.. చెత్త తొలగించక

● రోడ్డు పక్కన పేరుకుపోవడంతో ప్రయాణికులకు అవస్థలు
● ఇదీ గుంజుమెట్ట వద్ద పరిస్థితి

జలుమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లవానిపేటకూడలి సమీపంలో గుంజుమెట్ట వద్ద చెత్త తొలగించడంపై పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ కొరవడింది. శ్రీముఖలింగం వెళ్లే రహదారి కావడంతో ఈ మార్గంలో వెళ్లే భక్తులు, ప్రయాణికులు, వాహన చోదకులు దుర్వాసనతో అవస్థలకు గురవుతున్నారు. చల్లవానిపేట కూడలిలోనిల చికెన్ సెంటర్లు, చేపలు దుకాణాలు, కల్యాణ మండపాలు, టిఫిన్, భోజన హోటళ్ల నిర్వాహకులు నిత్యం చెత్త గుంజుమెట్ట వద్ద రోడ్డుపక్కన పారబోస్తున్నారు.అప్పుడప్పుడు స్థానికుల ఫిర్యాదుమేరకు పంచాయతీ సిబ్బంది చెత్త తొలగిస్తున్నా, మళ్లీ అదే చోట చెత్తను కొందరు తీసుకొచ్చి వేస్తుండడంతో మళ్లీ పరిస్థితి మొదటికొస్తోంది. గుంజుమెట్టవద్ద చెత్త వేస్తున్న వ్యాపారులకు నోటీసులు జారీచేసి కేసులు పెట్టకపోవడంతో అపరిశుభ్రం చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఇక్కడ ఉత్తర దిశలో చల్లవానిపేట పంచాయతీ, దక్షిణ దిశలో లింగాలవలస పంచాయతీ సరిహద్దు కావడంతో ఇరు పంచాయతీ సిబ్బంది చెత్త నిర్వహణపై దృష్టిసారించడంలేదు. అధికారులు గుంజుమెట్టవద్ద చెత్త కుప్పలు తొలగించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



గుంజుమెట్ట వద్ద రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త

నేడు దివ్యాంగుల కోసం 'స్వాభిమాన్'

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం స్వాభిమాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒకప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం విన్నవించాలని కోరారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత బాలుర పాఠశాలలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు నియోజకవర్గస్థాయి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సహిత ఉపాధ్యాయులు సూర్యం, సోమేష్ తెలిపారు.

నేడు జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లాస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలను శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూన రవికుమార్, కార్యదర్శి సూరశ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2011 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు.ఆధార్ కార్డుతో ఎంపికల స్థలానికి హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారు అక్టోబర్ నాలుగోతేదీ నుంచి నర్సీపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు, రేపు అక్షరాంధ్ర శిక్షణ శిబిరాలు

గుజరాతీపేట. సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి మండల కేంద్రం, మునిసిపాల్టీల్లో శుక్రశనివారాల్లో అక్షరాంధ్ర శిబిరాలను నిర్వహించనున్ననట్లు వయోజన విద్యా ఉపసంచాలకుడు అల్లు సోమేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మండలకేంద్రాల్లో జరిగే శిక్షణకు ఎంపీడీవోలు, మునిసిపల్ పరిధిలో జరిగే శిక్షణకు కమిషనర్లు అధ్యక్షత వహించనున్నారని పేర్కొన్నారు.ప్రతి మండలం, మునిసిపాల్టీలో ఇద్దరు ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వనుండగా, వీరు వలంటీర్ టీచర్లకు బోధన నైపుణ్యాలు, అక్షర వెలుగు బోధన పుస్తకంలోని అంశాలు వివరిస్తారని తెలిపారు.

22న డ్రోన్ పైలెట్ ఉద్యోగాలకు ఎంపికలు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని అభ్యుదయ డిగ్రీకళాశాలలో ఈనెల 22న డ్రాగ్ డ్రోన్స్ ప్రైవేట్ కంపెనీకి సంబంధించి డ్రోన్ పైలెట్ ఉద్యోగాలకోసం ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిసంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి లేదా అంతకంటే పైచదువులు పూర్తిచేసిన 18 నుంచి 28ఏళ్ల మధ్య వయసు గల పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22వేల జీతంతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలతో ఉదయం తొమ్మిది గంటలకు అభ్యుదయ డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9550967353 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని తుల్జాభవానీ ఆలయంలో ఈనెల 22 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త రాంగోపాల్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు రెండో తేదీన విజయదశమి పురస్కరించుకుని రాజరాజేశ్వరీదేవి అవతారంలో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ కుంకుమ పూజలు జరుగుతాయని తెలిపారు.

22న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సరుబుజ్జిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో థర్మల్‌పవర్‌ప్లాంట్ ప్రతిపాదన విరమించకపోతే ప్రతిఘటన తప్పదని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్‌దొర తెలిపారు. గురువారం సరుబుజ్జిలిలో పవర్‌ప్లాంట్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందరర్భంగా మాట్లాడుతూ ఈనెల 22న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. కోశాధికారి అత్తులూరి రవికాంత్, పోరాట కమిటీ కార్యదర్శి సింహాచలం, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి ధరఖాస్తుల ఆహ్వానం

పొందూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగాఉన్న కంప్యూటర్‌సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ మధుసూదనరావు ఒకప్రకటనలో తెలిపారు.55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయోషన్ పూర్తిచేసి ఉండాలని, యూజీసీ సెట్, ఏపీసెట్, లేదా పీహెచ్‌డీ చేసి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 22లోగా కళాశాలకు అందించాలని కోరారు.25న నిర్వహించనున్న ఇంటర్వ్యూకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

గూగుల్ అంబాసిడర్ కార్యక్రమానికి ఎంపిక

ఎచ్చెర్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో తృతీయ సంవత్సరం విద్యార్థి ఆశపు లోకేష్ గూగుల్ సంస్థ నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన స్టూడెంట్ అంబాసిడర్ క్రార్యక్రమానికి ఎంపికయ్యాడు.గూగుల్ సంస్థ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన లోకేష్ సంస్థ తరపున కళాశాలలో టెక్నాలజీపై అవగాహన, వర్క్‌షాపులు, సదస్సులు, నాయకత్వ లక్షణాలు పెంపొందించే బాధ్యతలను నిర్వర్తిస్తారు. లోకేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్, యాజమాన్య ప్రతినిధులు పి.దుర్గాప్రసాద్‌రాజు, దుప్పల వెంకటరావు అభినందించారు.

సరుబుజ్జిలిలో 'స్వస్తనారీ శక్తి పరివార్ అభియాన్'

సరుబుజ్జిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి పీహెచ్‌సీ ఆవరణలో స్వస్తనారీ శక్తిపరివార్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి పీహెచ్‌సీ వైద్యాధికారి సాహితీ ప్రియదర్శిని, షలంత్రి ఆయుష్ వైద్యాధికారి పూజారి పురుషోత్తమరావు, సీహెచ్‌వో మోహన్‌రావు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● బూర్జ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అల్లెనలో బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 47 మందికి రక్తపోటు, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

●ఆమదాలవలస, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెట్టక్కివలసలోని సచివాలయం-1 పరిధిలో 10, 11 వార్డుల మహిళల కోసం వైద్యాధికారి సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ జిల్లా సాధికారిత కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్‌యాదవ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.2.48 లక్షలు సాయం

కవిటి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకపాసుకుద్దికి చెందిన మత్స్యకారుడు కర్రి మేఘనాథానికి అండమాన్‌లో నివసిస్తున్న కపాసుకుద్దికి చెందిన మత్స్యకారులు, కులాధికారులు ఆసరాగా నిలిచారు. మేఘనాథం జూలై 24న రోడ్డుప్రమాదానికి గురయ్యాడు. ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో అండమాన్‌లో నివసిస్తున్న కపాసుకుద్దికి చెందిన మత్స్యకారులు సేకరించిన రూ.2,48,800లు మేఘనాథం కుటుంబ సభ్యులకు కలసి అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, బడేరామారావు, సంఘ అధ్యక్షుడు బడే తాతారావు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

●ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ చాంబర్ ఇంటర్‌నేషనల్ వీక్ ఎండ్ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థిని సోనియాకు 23 వేలు సంస్థ అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, సభ్యులతో కలిసి అందజేశారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు ప్రయత్నాలు

ఆమదాలవలస, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వైద్యకళాశాలలు ఏర్పాటుచేస్తేవాటిని ప్రైవేటీకరణచేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు ఆరోపించారు. గురువారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రభుత్వాలు ఎంతకాలం మనుగడ సాగించలేవన్నారు.

●రణస్థలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో నిర్మించిన వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేయడం ప్రజా వ్యతిరేక చర్య అని వైసీపీ జిల్లా నాయకుడు పిన్నింటి సాయికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ మేరకు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా మెడికల్ కళాశాల వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై విచారణ

●పెద్దకొజ్జిరియా సమీపంలో హద్దుల ఏర్పాటు



కంచిలి: ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొజ్జిరియా సమీపంలోని జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించారన్న సమాచారం మేరకు గురువారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. జాడుపుడి సమీపంలో కొందరి వ్యక్తులకు సుమారు ఆరు ఎకరాల స్థలం ఉండగా, మధ్యలో ప్రభుత్వ గోర్జిగా పిలువబడే 62 సెంట్ల స్థలంఉంది. ఇటీవల ఆ స్థల యజమానులు వెంచర్లుగా మార్చేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో తమ భూమితోపాటు ప్రభుత్వ గోర్జిని సైతం చదును చేశారు. దీన్ని గమనించిన పలువురు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్, ఆర్ఐ కృష్ణ చంద్రరౌళో, సిబ్బందితో కలిపి విచారణ నిర్వహించారు. ప్రభుత్వానికి చెందిన భూమిని సైతం చదును చేసినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వభూమికి హద్దులు నిర్ణయించి, దీనికి కారణమైన వ్యక్తులకు వివరణ కోరినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు విన్నవించారు.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు

ఆమదాలవలస, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెరువులను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.గణపతి హెచ్చరించారు. గురువారం శ్రీకాకుళం రూరల్ మండలంలోని,ఆమదాలవలస మునిసిపాలిటీ ఆరో వార్డు పరిధిలోని కె.మన్యయ్యపేటలోని చొక్కాకులబందతోపాటు చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులను ఆక్రమిస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందాయని, సర్వేచేసి ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. గతంలో చొక్కాకుల బంద చెరువు ఆక్రమణలు తొలగించామని, ఇంకా ఉంటే తొలగిస్తామని చెప్పారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జి.సిగడాం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండలాధ్యక్షుడు పైల విష్ణుమూర్తి తెలిపారు. గురువారం ఆనందపురం, ఆబోతులపేట, దవళపేట, వాడ్రంగి గ్రామాల్లో బీజేపీ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచనలతో సేవా పక్షోత్సవాలు నిర్వహించారు.అనంతరం దవళపేటకు చెందిన విశ్రాంత సైనికులను సన్మానించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కోకన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మజ్జిపర్తి రఘురాం, నాయకులు బూరాడ వెంకటరమణ, సాకేటి నాగరాజు, ముద్దాడ గౌరిశ్వర రావు, పొందూరి అప్పారావు, గట్టెం అప్పలరాజు, బోట్ల భాస్కరరావు, పొగిరి దాశరధి, మీసాల రామకృష్ణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల వాగ్వాదం

సరుబుజ్జిలి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):సరుబుజ్జిలి జంక్షన్‌లోని ఓ ప్రైవేటు షాపులో బుధవారం యూరియా పంపిణీపై చిగురువలస, మర్రిపాడు గ్రామాల రైతులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వంద బస్తాల యూరియాకు సంబంధించి చిగురువలస రైతులకు వ్యవసాయాధికారులు కూపన్లు అందజేశారు. అయితేమర్రిపాడు రైతులు కూడా అక్కడచేరుకున్నారు. మర్రిపాడు గ్రామస్థులకు చిగురువలస పంచాయతీలోని శ్రీరామవలస రెవెన్యూలో భూములుఉన్నాయని, వాటికి కూడా యూరియా సరఫరా చేయాలని రెండు గ్రామాల రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.సమస్య తెలుసుకున్న తహసీల్దార్ మధుసూదన్, ఏవోమన్మథరావు ప్రైవేటుషాపుల వద్దకు చేరుకొని యూరియా బస్తాలను తనిఖీ చేశారు. ఏయే గ్రామాలకు ఎంత యూరియా సరఫరాచేసింది, కూపన్లు వివరాలు పరిశీలించారు. యూరియాకోసం రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరం మేరకు సరఫరా చేయాలని జేసీ దృష్టికి తీసుకెళ్తామని రైతులకు తహసీల్దార్ వివరించారు.

యూరియా అందించండి

కంచిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు కోరారు. గురువారం కంచిలిలో విలేకరులతో మాట్లాడుతూ పది రోజుల్లో రైతులకు ఎరువులు అందివ్వని పక్షంలో, రైతులతో కలిసి శాంతియుత నిరసన తెలియజేస్తామన్నారు.

పెంటలో చెవిటి పోలమ్మ ఉత్సవాలు



అమ్మవారి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంటలో చెవిటి పోలమ్మ గ్రామదేవతఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు నీలమ్మతల్లి అమ్మవారి ఉత్సవవిగ్రహాలకు తిరువీధి నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపుకుంకుమ,ముర్రాటలు సమర్పించారు. నీలమ్మతల్లిని ఊరే గింపుగా తీసుకువెళ్లి వనుం వద్ద దండకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి మక్క విజయలక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

200 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

జి.సిగడాం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెంటలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 200పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్, ఎల్ఎస్ఏ తమ్మినేని మంగవేణి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచి హిందీ బోధించాలి

సోంపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి హిందీ బోధిస్తే పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు వస్తాయని భాషా ప్రచారకులు నిరంజన్, హిందీ వికాస వేదిక అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు. గురువారం గొనకపాడు, హంకుంపేట పాఠశాలల్లో విద్యార్థులకు హిందీ లిపి పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లిపి పుస్తకాలను ముద్రించిన దుద్దిశ్రీనివాసరావు, పి.పండాలను అభినందించారు. అలాగే సోంపేటలోని శ్రీశైనవీధి పాఠశాల, హుంపేట, గొనకపాడు, కుమ్మరిపేటల్లో చదువుతున్న 200 మంది విద్యార్థులకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్య, సుహాసిని, సోమనాధం, సత్యంరాజు పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి బోరు వితరణ

సోంపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):చిన్నమామిడిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మహాసేన యువజన సేవాసంఘం తాగునీటిబోరును ఏర్పాటు చేసింది. ఈ మేరకు బోరు గురువారం ప్రారంభించారు. కార్య క్రమంలో హెచ్ఎం శిల్లా హరి, ఆశ వర్కర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

83 మంది రక్తదానం

అరసవల్లి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని కెమిస్ట్అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భవనంలో జాతీయ స్వచ్ఛంద రక్తదానకార్యక్రమాన్ని పురస్కరించుకుని అసోసియేషన్, అపోలో మెడ్‌ప్లస్ సంస్థల సహకారంతోమందుల వర్తకులు గురువారం రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 83 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు.కార్యక్రమంలో ఔషధ నియంత్రణ అధికారి ఎం.చంద్రరావు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ కె.రాజశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ అమూల్య, రక్తనిధి కేంద్ర వైద్యురాలు సునీత, శ్యామలి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.కరుణకమార్ గుప్తా పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రేమ, ఆకర్షణలకు లోనుకాకుండా చదువుపై దృష్టిపెట్టాలని ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు కోరారు. గురువారం ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు శాఖ, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నారీశక్తి- స్త్రీశక్తి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి, పీవో ఎస్.రజనీకుమార్,అధ్యాపకులు బి.సునీత, శాంతిశ్రీ, లత పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రిలో తనిఖీ

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రిని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు గురువారం తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో మానసిక రోగుల విభాగంలోసమస్యలు, వసతిసదుపాయాలు అడిగితెలుసుకొన్నారు. వైద్యాధికారులకు మానసిక రోగులు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలుచేశారు. అనంతరం ఆసుపత్రిలో గల వన్ స్టాప్ కేంద్రాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో డాక్టర్ డి.విజయలక్ష్మి, టి.అలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కొత్త డీసీసీని ప్రకటిస్తాం


●ఓట్ చోరీపై సంతకాల సేకరణ: పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం



మాట్లాడుతున్న జేడీ శీలం

అరసవల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) కేంద్రంలోని బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని ఏపీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం ఆరోపించారు. ఈవిషయంపై అక్టోబరు 15వ తేదీ వరకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. త్వరలో కొత్త డీసీసీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. గురువారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహనరావు, సనపల అన్నాజీరావు, కోతమధుసూదనరావు, పూడి కిరణ్‌కుమార్, నగర అధ్యక్షుడు రెల్ల సురేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మధుసూదనరావు, అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్'లో వినతుల స్వీకరణ



రామ్మోహన్‌నాయుడితో మాట్లాడుతున్న మహిళ

శ్రీకాకుళం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పలుప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

షెడ్ మంజూరుచేయాలి

సోంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):సోంపేటలో వీరబ్రహ్మేం ద్రస్వామి ఆలయ ఆవరణలో షెడ్‌నిర్మాణం కోసం నిధులు మంజూరూ చే యాలని మాజీ మంత్రి గౌతుశివాజీ కోరారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నా యుడికి టీడీపీ మండలాధ్యక్షుడు మద్దుకుమార్, సోంపేట పట్టణాధ్యక్షుడు చిత్రాడ శేఖర్, విశ్వబ్రాహ్మణ ప్రతినిధి దేవురాముతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా షెడ్ నిర్మాణానికి రూ 10లక్షలు మంజూరు చేస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

డయాలసిస్ కేంద్రంలో సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డయాలసిస్ కేంద్రంలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, యాదవ కార్పొరేషన్ డైరక్టర్ దాసరి రాజు తెలిపారు. గురువారం ఇచ్ఛాపురంలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు.

పథకాలపై అవగాహన అవసరం: పీడీ



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యువతకు ప్రధాన మంత్రి రైతునిధి, ఆయుష్మాన్ భారత్, నైపుణ్య భారత్ వంటి ప్రధాన పథ కాలపై అవగాహన అవసరమని డీఆర్డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, మేరా యువ భారత్ మహాన్ వారి ఆధ్వర్యంలో వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమంలో మేరా యువ భారత్ ఉప సంచాలకుడు కె.వెంకట్ ఉజ్వల్,జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, నాబార్డు అధికారి కె.రమేష్‌కృష్ణ, లీడ్‌బ్యాంకు మేనేజర్ పి.శ్రీనివాసరావు, సెట్‌శ్రీ సీఈవో వీవీఅప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు, నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, స్వీప్‌నిర్వాహకుడు కె.రమణమూర్తి, స్పందన అధ్యక్షుడు పి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఖాళీల సమాచారం తెలియజేయాలి

గుజరాతీపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):కుప్పిలిలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏడుగురు ఉపాధ్యాయులపై పెండింగ్ ఉన్న చార్జెస్ ఎత్తివేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు.గురువారం డీఈవోకి ఎస్టీయూనాయకులుఎస్వీ రమణమూర్తి, జి.రమణ, కూనశ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. అంతర్ జిల్లా బదిలీల కోసం జిల్లాకు స్పౌస్ కేటగిరి, మ్యూచువల్ కేటగిరిలో కలిపి అప్లికేషన్లు, బదిలీకు అవకాశం ఉన్న ఖాళీల సమాచారాన్ని తెలియజేయాల్సిందిగా కోరారు.

ఎస్‌హెచ్‌జీ రుణాల స్వాహాపై ఫిర్యాదు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ స్వయం శక్తి సంఘ సభ్యులు బ్యాంకుకు ప్రతి నెలా కడుతున్న రుణాలను సంఘ ఆర్గనైజర్ స్వాహాచేసిందని, తమకు న్యాయం చేయాలని సభ్యులు కోరారు. ఈ మేరకు పలువురు సంఘ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్గనైజర్ భర్త తమతో దురుసుగా వ్యవహరిస్తున్నాడని, బ్యాంకుకు కట్టాల్సిన సొమ్ము కట్టకపోవడంతో, తామంతా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుజరాతీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవ రణలో సెంటర్ ఫర్ అప్లైడ్ సైన్సెస్, జువాలజీ విభాగం సంయుక్తంగా సైన్స్ వై బ్రేషన్స్ పేరిట డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులతో సైన్స్ ఎక్స్‌పో జరిగింది.

వివాహిత ఆత్మహత్య

నందిగాం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వీరభద్రాపురం పంచాయతీ తమలాపురం గ్రామానికి చెందిన వివాహిత కదంబాల శిల్పాచౌదరి(24) ఆత్మహత్య చేసుకుంది. దీనికి భర్త వేధింపులే కారణమని శిల్ప తల్లి పాండవ లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం దేవపురం గ్రామానికి చెందిన శిల్పను తమలాపురం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో వివాహమైంది. రాజ్‌కుమార్ వేధింపులు తాళలేక బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం తల్లి లక్ష్మి, బంధువులు గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసు నమోదు చేయగా టెక్కలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు. శిల్పాకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

జార్ఖండ్‌కు చెందిన పోర్టు కార్మికుడి మృతి

సంతబొమ్మాళి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టులో పనిచేస్తున్న జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు పక్లూ పింగ్వా(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు నౌపడ ఎస్.ఐ.నారాయణస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్‌కు చెందిన పింగ్వా రెండు వారాల కిందట మూలపేట పోర్టులో లేబర్ పనికోసం వచ్చి లేబర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలుస్తుంది. పోర్టుమార్టం కోసం మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కి గాయాలు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేశవరావుపేట జంక్షన్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన ప్రమాదంలో కంటైనర్ లారీ డ్రైవర్ గాయపడ్డాడు. ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ కేశవరావుపేట జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బిహార్‌కు చెందిన కంటైనర్ లారీ డ్రైవర్ రామ్‌నాథ్ రాయ్‌ను 108 అంబులెన్స్‌పై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

ప్రేమ పేరుతో విద్యార్థినికి వేధింపులు

పలాస రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పలాస మండలం రెంటికోట జడ్పీ హైస్కూల్‌లో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి అదే పాఠశాలలో చదువుతున్న ఓ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఆ వ్యక్తి పాఠశాలకు రాత్రిపూట కాపలాగా ఉండాల్సి ఉండగా ప్రేమ పేరుతో ఆ బాలికను వేధిస్తుండడంతో ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు పాఠశాల హెచ్‌ఎం నిర్మల దృష్టికి తీసుకువెళ్లారు. రెండురోజుల కిందట ఈ ఘటన జరిగినా బయటకు పొక్కనీయకుండా స్కూల్ సిబ్బంది జాగ్రత్తలు చేపట్టినా.. గ్రామస్థులంతా స్కూల్‌కు చేరుకొని ఘటనపై హెచ్‌ఎంను, ఉపాధ్యాయులను ప్రశ్నించగా.. విషయం ఎంఈవో-2 సత్యం వద్దకు చేరింది. దీంతో గ్రామస్థులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గురువారం ఎంఈవో-2 సమావేశం నిర్వహించారు. సమస్య మరింత పెద్దది కాకుండా నైట్‌వాచ్‌మన్‌ను పని నుంచి తొలగించేందుకు నిర్ణయించారు. మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని స్కూల్ మేనేజ్‌మెంట్, గ్రామస్థుల సమక్షంలో ఎంఈవో-2లు హెచ్‌ఎం నిర్మలకు చెప్పడంతో వివాదం కాస్త సద్దుమణిగింది.

రూ.26వేల వేతనం అందించాలి


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, మునిసిపల్ కార్మికులు

పలాస, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు 12వ పీఆర్సీ ప్రకారం నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు ఎన్.గణపతి, సీహెచ్ మురుగన్ మాట్లాడుతూ.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5 నుంచి రూ.7 లక్షల కు పెంచాలని డిమాండ్ చేశారు. దహన సంస్కరణల ఖర్చులకు రూ.15వేలు నుంచి రూ.20వేలుకు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్.శంకర్, అమర్‌నాయక్, ఎం.రవి, ఎన్.ఢిల్లీ, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధితో జాగ్రత్త

కోటబొమ్మాళి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గాలికుంటువ్యాధి బారిన పడిన దూడలు ఎక్కువగా మృతి చెందుతుంటాయని పశువైద్య సహాయ సంచాలకులు మందా లోకనాథం అన్నారు. పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, మెండ ప్రజ్ఞచైతన్య ఆధ్వర్యంలో గురువారం మండలంలో గల ఎత్తురాళ్లపాడు, రావిపాడు, సుబ్బారావుపేట, కోటబొమ్మాళి, బావాజీపేట, యరకయ్యపేట గ్రామాల్లో జరిగిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని 471 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది భానుమతి, భాస్కరరావు, రమణమూర్తి, భూమిక, రోహిత్, లక్ష్మణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొండు నారాయణరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రణభేరి జాతాలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణలో భాగంగా గురువారం మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని, డీఏ బకాయిలని చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుంచి విముక్తిని కలిగించాలన్నారు. జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, మన్మథరావు, తవిటమ్మ, నీలకంఠేశ్వరరావు, ఆదినారాయణ, రమణమ్మ పాల్గొన్నారు.

ఆ సచివాలయం నుంచి వేరు చేయండి


నిరసన తెలుపుతున్న సుభద్రాపురం గ్రామస్థులు

నందిగాం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరు గ్రామ సచివాలయం నుంచి తమ గ్రామాన్ని వేరుచేయాలని సుభద్రాపురం గ్రామస్థులు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సచివాలయం పరిధిలోని సుభద్రాపురం పంచాయతీ ఉన్నప్పటికీ విత్తనాలు, ఎరువులు తదితర సందర్భాల్లో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎరువులు అందకపోవడంపై ఏవో పి.శ్రీకాంత్ వర్మ దృష్టికి తీసుకువెళ్లారు. కాపుతెంబూరు సచివాలయం నుంచి వేరుచేసి నందిగాం లేదా పెద్దలవునిపల్లి సచివాలయాల్లో కలపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.సోమేశ్వరరావు, రైతులు శంకరరావు, కర్రయ్య, కామయ్య, రామారావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో రాణించాలి


టెక్కలి, సెపెటంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో పోటీల్లో రాణించాలని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ పి.సుధారాణి అన్నారు. గురువారం మండల, డివిజన్ స్థాయిలో రాణించిన క్రీడాకారులను అభినందించారు. హెచ్‌ఎం నందికేశ్వరరావు తదితరులు పాల్గొన్నాఉ.

ఉన్నరోడ్డు ఊడదీశారు!

- నిలిచిపోయిన మాకనాపల్లి రహదారి పనులు
- బిల్లులందక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- తేలిపోయిన మెటల్..
- పట్టించుకోని యంత్రాంగం
- అవస్థలుపడుతున్న వాహనచోదకులు

పాతపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న' చందంగా తయారైంది పాతపట్నం- మాకనాపల్లి రోడ్డు పరిస్థితి. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఈ రోడ్డుకి కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రావడంతో మహర్దశ పట్టిందనుకున్నారు ఆ ప్రాంతవాసులు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఏప్రిల్ 15న పాతపట్నం సీపీ రోడ్డు నుంచి అంతరాబ, చంగుడి, సరాళి మీదుగా మాకనాపల్లి జంక్షన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.05 కోట్ల వ్యయంతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే పనులు కూడా ప్రారంభమయ్యాయి. సుమారు ఆరు కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డులో సగం వరకు ఉన్న పాత తారు రోడ్డును తొలగించి మెటల్ కూడా వేశారు. బిల్లులు సకాలంలో పడకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో ఈ రోడ్డు రాళ్లు తేలిపోయి ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. గతంలో అక్కడక్కడ ఉన్న గోతులను తప్పించుకుని ప్రయాణించేవాళ్లమని... ఇప్పుడు ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయం వేస్తుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారి త్వరితగతిన పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గోతులమయంగా మారిన రహదారి


రాళ్లుతేలిన రహదారి

బిల్లుల జాప్యంతోనే..

ఈ రహదారి పనులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్లే జాప్యం జరుగుతుంది. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. బిల్లులు విడుదలైన వంటనే తిరిగి పనులు ప్రారంభించేలా చేస్తాం.

- టి.ప్రసాదరావు, జేఈ పంచాయతీరాజ్

భారీ వాహనాలతో గుంతలు

పాతపట్నం నుంచి కోదూరు వెళ్లే బీటీ రోడ్డుపై నిత్యమూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో గోతుల మయమైంది. స్థానిక వేంకటేశ్వర ఆలయ కూడలి మొదలుకొని కోదూరు గామం వరకూ ఇదే పరిస్థితి. బీటీ రోడ్డు మార్గంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా భారీ వాహనాల తిరుగుతుండడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో వాహనాల రాకపోకలతో నిత్యమూ రద్దీగా ఉండే ఈ మార్గంలో ఇలా అడుగడుగునా గోతులు ఏర్పడడంతో ఇబ్బందిపడుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పక్కా రహదారికిగా మార్చేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.


గుంతలు ఏర్పడిన కోదూరు బీటీ రోడ్డు

అక్కుపల్లి రోడ్డును పూర్తి చేయించండి


కేంద్రమంత్రితో మాట్లాడుతున్న గౌతు శివాజీ

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి గౌతు శివాజీ కోరారు. గురువారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని శ్రీకాకుళంలో గల తన క్యాంపు కార్యాల యంలో శివాజీ కలిసి మాట్లాడారు. నాలుగేళ్లుగా రోడ్డు పనులు నిలిచిపోవడంతో వాహనచోదకులు, బాటచారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అలాగే తాళభద్ర, కాశీబుగ్గ రైల్వే పై ఓవర్ నిర్మాణాలు త్వరితగతినా పూర్తి చేయించాలని కోరారు.

- టెక్కలి/రూరల్: టెక్కలి మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిని గురువారం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అభినందించారు. రైతు సేవల్లో మార్కెట్ కమిటీ ద్వారా పురోభివృద్ధి సాధించాలని కేంద్రమంత్రి ఆకాంక్షించారు. పార్టీలో కష్టబడే వారికి సముచిత స్థానం లభిస్తుందని, ఇందుకు శేషగిరే ఉదాహరణ అని అన్నారు. ప్రసాద్‌రెడ్డి, కీర్తి, వినోద్ తదితరులు ఉన్నారు. అనంతరం కేంద్రమంత్రికి మార్కెట్ కమిటీ చైర్మన్ శేషగిరి సన్మానించారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పారిశుధ్య పనులపై ఆరా తీస్తున్న అధికారులు

టెక్కలి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ప్రత్యేకంగా జరుగుతున్న పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భారతి, డీఎల్‌పీవో ఐవీ రమణ పరిశీలించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల టెక్కలిలో పలు వీధుల్లో పర్యటించి అపరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించడంతో వారం రోజులుగా పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో పనులు జరుగుతున్న తీరును గురువారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సింహాద్రి, టెక్కలి కార్యదర్శి ఏవీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటీకి సహకరించండి

పలాస, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటీగా చేసేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ ఎన్.రామారావు కోరారు. గురువారం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో స్వచ్ఛతా సేవ ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు ప్రజలకు వివరించారు. సచివాలయం సూపర్‌వైజర్లు, పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

హిరమండలం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కనిగిరిలో ఈ నెల 17న జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ జి-జిట్స్ పోటీల్లో హిరమండలానికి చెందిన బిడ్డిక చామంతి 66 కిలోల విభాగంలో, చింతాడ స్వప్న 46 కిలోల విభాగంలో, తోట సింహాచలం 65 కిలోల విభాగం సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో వచ్చే నెల 9 నుంచి 12 వతేదీ వరకు జరగనున్న జాతీస్థాయి పోటీలో వీరు పాల్గొనున్నట్టు శిక్షకుడు తోట సింహాచలం చెప్పారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

హిరమండలం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలని హిరమండలం ఎస్ఐ రమేష్ అన్నారు. గురువారం పాతహిరమండలం గ్రామంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల నివారణ, మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణపై అవగాహన కల్పించారు. మహిళలలపై అసభ్యంగా ప్రవర్తిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంటల ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలని ఏవో కె.సింహాచలం తెలిపారు. ఇంతవరకు 75 శాతం ఈ-క్రాప్ నమోదు చేయడం జరిగిందన్నారు. సుమారు వారం రోజుల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు.

లే అవుట్‌లో బయటపడ్డ ప్రభుత్వ భూమి

సంతబొమ్మాళి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇజ్జువరం పంచాయతీ నౌపడ రైల్వేగేట్ సమీపంలో నౌపడ-టెక్కలి మెయిన్ రోడ్డు పక్కన వేసిన లే అవుట్‌లో ప్రభుత్వ భూమి కలిపేసినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణపై ఇజ్జువరం రైతులు ఈ లే-అవుట్ వేసిన వ్యక్తిని ప్రశ్నించగా.. తాను టెక్కలి మాజీ ఎమ్మెల్యే మనుమడనంటూ బెదిరింపులకు పాల్పడినట్టు అప్పట్లో ఆ గ్రామ రైతులు తెలిపారు. వంశధార కాలువ కబ్జా చేయడంతో వరదనీరు ప్రవాహం ఆగిపోయి పంట పొలాలు ముంపునకు గురవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఈ ఏడాది జూలైలో 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'వంశధార కాలువ కబ్జా' శీర్షికతో ప్రచురితమైన కథనంపై వంశధార, రెవెన్యూ అధికారులు పరిశీలించి తాత్కాలికంగా కాలువను పునరుద్ధరించారు. అనంతరం తహసీల్దార్ హేమసుందరరావు ఆదేశాలతో సర్వేయర్ సుభాష్, ఆర్ఐ ప్రేమ్, వీఆర్వో జోగారావు సర్వే చేపట్టారు. ఆక్రమణలను గుర్తించి తహసీల్దార్‌కి నివేదిక అందజేశారు. దీనిపై టెక్కలికి చెందిన సీపాన అమ్మోజీబాబుకు నోటీసు జారీ చేశారు. నోటీసుకు సమాధానం వచ్చిన వెంటనే ఆక్రమణలు తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు.

రైతు బజార్ కోసం స్థల పరిశీలన


పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కాశీబుగ్గ, సెప్టంబరు 18(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో రైతు బజారు ఏర్పాటుకు గురువారం స్థల పరిశీలన చేశారు. కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న యూపీ పాఠశాలలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, మార్కెటింగ్ డీఈఈ సీహెచ్ రామారావు, కార్యదర్శి ఆంధ్రయ్య, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాఠశాల మొత్తం పరిశీలించారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులు రైతు బజార్ కోసం 20 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఉన్న 60 సెంట్లు స్థలాన్ని పరిశీలించారు.

ఎల్ఐసీ జాతీయకరణలో మైత్రా సేవలు గొప్పవి

నరసన్నపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ పార్లమెంట్ సభ్యులు సునీల్ మైత్రా ఎల్ఐసీను జాతీయకరణ చేయడంతోపాటు ఆల్‌ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పాటు చేడయంలో కీలక పాత్ర పోషించారని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకులు, బీఎం మల్లా నేతాజీ, ఆర్. సురేష్ బాబఉ అన్నారు. గురువారం ఎల్ఐసీ కార్యాలయం ఆవరణలో సునీల్ మైత్రా 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళలు అర్పించారు. ప్రభుత్వరంగంలో ఎల్ఐసీను కాపాడుకోవడమే మైత్రాకు ఇచ్చిన నిజమైన నివాళలు అని యూనియన్ నాయకులు సురేష్‌బాబు అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయ కులు సోమేశ్వరరావు, సీతారామచార్యులు, శ్రీనిధి, శ్రీనివాస్, జనార్ధనరావు, మాధవరావు, రామేశం, బాలగంగాధర్, మల్లేశ్వరరావు, కిషోర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

జలుమూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టెక్కలిపాడు గ్రామ సచివాలయంలో జేఎల్ఎంగా పనిచేస్తూ కోటబొమ్మాళి మండలం కిష్టపురం వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందిన పాగోడు గ్రామానికి చెందిన మామిడి సురేష్ కుటుంబానికి కోటబొమ్మాళి మండలం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న తోటి ఉద్యోగులు గురువారం రూ.70 వేలు సాయాన్ని అందించారు. కోటబొమ్మాళి ఎంపీడీవో ఫణీంద్రకుమార్ చొరవతో తర్లిపేట గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శి రమేష్ సహాయ సహకారాలతో మృతిచెందిన జెఎల్ఎం తల్లిదండ్రులు సరోజిని, రాజారావుకు సాయాన్ని అందించారు.

గ్రానైట్ పనులకు అనుమతి ఇవ్వొద్దు

మెళియాపుట్టి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సుర్జిణి సమీపంలో నిర్వహిస్తున్నా క్వారీ పనులకు అనుమతులు ఇవ్వొద్దని ఆ గ్రామస్థులు కోరారు. గురువారం క్వారీ వద్ద ఆందోళన చేసి తహసీల్దార్ బి.పాపరావుకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి వెళ్లే రోడ్డు ఇప్పాటికే పాడైపోయిందని, ఇప్పుడు క్వారీలకు అనుమతులు ఇస్తే అన్ని విధాలుగా నష్టపోతమని ఆవేదన వ్యక్తంగా చేశారు. కార్యక్రమంలో సుర్జిణి గ్రామస్థులు, యువకులు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యంపై దృష్టిసారించాలి

హరిపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు దృష్టిసారించాలని వమరవల్లి డైట్ ఆంగ్ల అధ్యాపకరాలు జి.ఇందువదన అన్నారు. మందస మండలం సొండిపూడి, మఖరజోల ప్రాథమిక పాఠశాలలు, కొత్తపల్లి ఉన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సరుబుజ్జిలి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నందికొండ, సరుబుజ్జిలి, వెన్నెలవలస, జవహర్ నవోదయ విద్యాలయం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

- ఎచ్చెర్ల: ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్ పురం, చిలకపాలెం, ఫరీద్‌పేట, జరజాం, ఎస్ఎం పురం, చినరావుపల్లి తదితర గ్రామాలకు సరఫరాను నిలిపివేస్తామన్నారు.
- ఆమదాలవలస: గాజులకొల్లివలస సబ్‌స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గాజులకొల్లివలస, చిన్నజొన్నవలస, మునగవలస, అక్కులపేట, రామచంద్రాపురం, పొన్నాంపేట, చిట్టివలస, సైలాడ, దన్నానపేట గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామన్నారు.
- పొందూరు: తాడివలస సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ పి. యోగేశ్వరరావు తెలిపారు. తాడివలస సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలో తాడివలస, లొద్దలపేట, వెంకంపేట, బెలమాం గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.
- గార: మండల కేంద్రం గార వద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి విద్యుత్ సరఫరా లైన్ ఏర్పాటు, చెట్లు కొమ్మలు కత్తిరింపు దృష్ట్యా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గారలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ యోగేశ్వరరావు తెలిపారు.
- నరసన్నపేట: పట్టణ పరిధిలో గల 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్లు మరమ్మతులు చేపట్టనుండడంతో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నట్టు ఈఈ నరసింహకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో నరసన్నపేట, సత్యవరం, బొరిగివలస, జమ్ము, తామరాలపల్లి, గొట్టిపల్లి, కరగాం, కంబాయి. దూకలపాడు, చల్లబంద, జిల్లేడివలస, జడూరు గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.
- జలుమూరు (సారవకోట): బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు ఈనెల 20న శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ నరసింహకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుడితి ఎంహెచ్‌వో ఫీడర్‌పై మరమ్మతు పనులు చేపడుతున్నందున ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. బుడితి ఫీడరుపై గల అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.
- వజ్రపుకొత్తూరు: మండల కేంద్రం వజ్రపుకొత్తూరు పరిధిలోగల 11 కేవీ విద్యుత్ లైన్‌లో చెట్లు కొమ్మలు తొలగింపు చేపట్టనుండడంతో శనివారం పాతటెక్కలి, దేవునల్తాడా, యుఆర్‌కే పురం, వజ్రపుకొత్తూరు, మంచినీళ్లపేట, నగరంపల్లి, బెండి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ యజ్ఞేశ్వరరావు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహన్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

నిధులు అందించాలి


మంత్రి నారాయణకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస/రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. గురువారం రాజధాని అమరావతిలో మంత్రి నారాయణను కలిసి వినతి పత్రాన్ని అందించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించేందుకు, నెహ్రూ పార్కు సుందరీకరణకు, సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, బీటీ రోడ్ల కనెక్టివిటీ అంశాలను ప్రస్తావించారు. ఇందుకోసం రూ.10కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. సూదికొండ ప్రాంతంలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లకు నిధులకు సంబంధించి మునిసిపల్ అధికారులు రూ.1.5కోట్లతో అంచనాలు తయారు చేశారని, ఆ ప్రతిపాదనను మంత్రి నారాయణకు అందజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలాస, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహించనున్నట్టు డీఎం ఎంఎస్ఎస్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలు ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు ఆర్టీసీ బస్సుల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు 9959225610 ఫోన్ నెంబరులో తెలపాలన్నారు. బస్సుల రాకపోకలు, నిలుపుదల, వేళల్లో మార్పులు వంటి అంశాలు తెలియజేయాలన్నారు.


సమస్యలు పరిష్కరించాలి

పలాసరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించి బకాయి ఉన్న డీఏలను తక్షణమే చెల్లించాలని ఏపీఎన్‌జీవో సభ్యులు డిమాండ్ చేశారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఎన్‌జీవో అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బోనెల గోపాల్, ఇన్‌చార్జి ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఏపీఎన్‌జీవో సెక్రటరీ బి.ఉపేంద్రరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, పంచాయతీ సెక్రటరీలు సుధాకర్, సద్గుణరావు, ఆశ, శ్రీదేవి, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు చేపట్టారు.

చెస్ పోటీలకు ఎంపిక

పలాసరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పలాస మండలంలో ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్‌లో సాయికాలనీ హైస్కూల్ విద్యార్థిని ఎల్.దీత్య అండర్-14 చెస్ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సాయికాలనీ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎల్.దీత్యను అభినం దించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.కల్యాణి, ఉపాధ్యా యులు ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయ చైర్మన్‌గా పెద్ద గోవింద్


ఆలయ కమిటీ అధ్యక్షుడు పెద్దగోవింద్

కోటబొమ్మాళి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా కోటబొమ్మాళికి చెందిన కోరాడ పెద్ద గోవింద్‌ను నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా ఎస్.గణపతిరావు, బి.ప్రసాదరావు, డి.నాగరాజు, కె.అప్పలరాజు, ఎం.వెంకటరావు, పి.ఇందువదన, పి.కౌసల్య, ఎ.యశోధ, సీహెచ్ శోభారాణి, డి.కల్యాణి నియమితులైనట్టు ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. వీరికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, నాయకులు కె.నాగయ్యరెడ్డి, కె.లక్ష్మణ్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

పాతపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని ఎస్ఐ మధుసూధనరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆటోడ్రైవర్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. నేర నియంత్రణలోనే భాగస్వామ్యం కావాలన్నారు. గంజాయి తదితర నిషేధిత సరుకుల రవాణా సమాచారం ఇచ్చి సహకరించాలని తెలిపారు.